సాక్షి
యాదాద్రి భువనగిరి

బుధవారం । 17 । జనవరి । 2024



యువత క్రీడల్లో రాణించాలి
యువత క్రీడల్లో రాణించాలని మును గోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు.
- 9లో



తవ్వకాలకు ప్రతిపాదనలు
ఫణిగిరి గుట్టపై మరోసారి తవ్వకాలకు ప్రతిపాదనలు పంపిస్తామని పురావస్తు వారసత్వ శాఖ డైరెక్టర్ తెలిపారు.
- 10లో



సిరి ధాన్యాలతో వ్యాధులు దూరం
సిరి ధాన్యాలతో వ్యాధుల నుంచి దూరం కావొచ్చని మిల్లెట్ మ్యాన్‌గా పేరుగాంచిన డాక్టర్ ఖాదర్ వలీ అన్నారు.
- 10లో

న్యూస్‌రీల్

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. క్షేత్రపాలకుడిగా పూజలందుకుంటున్న శ్రీఆంజనేయస్వామికి అర్చకులు ఆకుపూజను మంగళవారం విశేషంగా నిర్వహించారు. అంజనీపుత్రుడు హనుమంతుడికి ఇష్టమైన రోజు కావడంతో ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో ఆకుపూజ జరిపించారు. ఇక ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగించారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలు నిర్వహించారు.

గోదాదేవికి ఒడి బియ్యం సమర్పణ



గోదాదేవికి ఒడి బియ్యం సమర్పిస్తున్న అర్చకులు, భక్తులు

యాదగిరిగుట్ట: ధనుర్మాస ఉత్సవాల చివరిరోజులో భాగంగా సోమవారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో గోదాదేవి అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. నెల రోజులుగా కొనసాగిన ధనుర్మాస ఉత్సవాలు భాగంగా ఆదివారం రాత్రి గోదాదేవి – శ్రీరంగనాథుల కల్యాణ వేడుకను నిర్వహించిన అర్చకులు సోమవారం ఒడి బియ్యం కార్యక్రమంతో నెల రోజుల ఉత్సవానికి ముగింపు పలికారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చౌటుప్పల్ : చౌటుప్పల్‌లోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు(బుధవారం) పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సతీష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ కేంద్రంలోని 01వ ఫీడర్ పరిధిలో వలిగొండరోడ్, వినాయకనగర్, రాంనగర్, భాస్కర్ టాకీస్, శాంతినగర్, ఫైర్ స్టేషన్‌ఏరియా, శ్రీకృష్ణానగర్, విద్యానగర్, పోలీస్‌స్టేషన్, రామాలయంఏరియా, భారత్ నగర్, హైస్కూల్‌ఏరియా, బీసీకాలనీ, మల్లన్నదేవాలయం ప్రాంతాల్లో ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సరఫరా నిలిపియనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కూరగాయలు, మాంసం దుకాణాల్లో తనిఖీ

నల్లగొండ: నల్లగొండలో మంగళవారం ఆయా కూరగాయలె, మాంసం దుకాణాల్లో జిల్లా లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు తనిఖీలు చేశారు. వ్యాపారులు వినియోగిస్తున్న తూకం యంత్రాలు, తూకపు రాళ్లను పరిశీలించారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు రావడంతో హైదరాబాద్ రోడ్డు, దేవరకొండ రోడ్డుల్లోని చికెన్, మటన్ , చేపల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేసామని జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి పి.రామకృష్ణ తెలిపారు. తనిఖీల్లో కిలోకు 50 గ్రాముల తక్కువ తూకం ఉన్నట్లు తేలిందన్నారు. మా చికెన్ సెంటర్, లక్ష్మీచికెన్ సెంటర్, చేపల వ్యాపారి సైదులుపై కేసులు నమోదు చేసి జరిమానా విధించినట్లు తెలిపారు. తనిఖీలో లీగల్ మెట్రాలజీ జిల్లా పరిశీలకులు వి.శ్రీనివాస్, శాఖ అధికారులు జలీల్‌ఖాన్, డి.సైదులునాయక్, డి.సైదులు పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణీ కొనసాగించాలి

నల్లగొండ టూటౌన్: రాష్ట్రంలో ఉచిత చేప పిల్లల పంపిణీ పథకాన్ని కొనసాగించాలని ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్య నారాయణ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నాయీ బ్రాహ్మణ, గొల్ల, కురుమ, గౌడ్, మత్స్య కార్మికుల ఆర్థిక అభివృద్ధికి అనేక పథకాలు చేపట్టిందని పేర్కొన్నారు. ఉచిత చేప పిల్లల పంపిణీ ద్వారా మత్స్యకారులకు జీవనోపాధి లభించడంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు.

● భక్తజన యాదాద్రి



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ ముఖ మండపంలో భక్తుల రద్దీ

● తిరుగు ప్రయాణ రద్దీ



సంక్రాంతికి వచ్చిన వారు జంట నగరాలకు తిరుగుప్రయాణం కావడంతో చౌటుప్పల్‌లో హైవేపై విజయవాడ మార్గంలో నెలకొన్న వాహనాల రద్దీ



చౌటుప్పల్‌లోని బస్టాండ్ వద్ద జంక్షన్‌లో గజిబిజిగా వెళ్తున్న వాహనదారులు, పాదాచారులు

భూ సమస్యలపైనే అధికం

- ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నుంచి భారీగా వినతులు
- 151 ఫిర్యాదుల్లో 117 రెవెన్యూ శాఖకు సంబంధించినవే..
- ఆయా శాఖలకు పంపిన అధికారులు
- వారంలోగా పరిష్కరించాలని ఆదేశం



సాక్షి, యాదాద్రి: హైదరాబాద్‌లోని జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో గత నెల ప్రభుత్వం నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నుంచి భారీగా వినతులు అందాయి. మొత్తం 170 ఫిర్యాదులు రాగా అందులో 18 ఫిర్యాదులు ఇతర జిల్లాలకు చెందినవి ఉన్నాయి (భద్రాద్రి జిల్లాకు చెందిన భూ సమస్య ఫిర్యాదు యాదాద్రి జిల్లాకు వచ్చింది). ఒక ఫిర్యాదు డబుల్ వచ్చింది. ఇక 151 ఫిర్యాదుల్లో 117 రెవెన్యూ శాఖకు సంబంధించినవి ఉన్నాయి. ఇందులో 28 డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం, ఖబ్జాకు గురవుతున్న భూములను పరిరక్షించాలని, పింఛన్ కావాలని, ఉద్యోగాలు ఇప్పించాలని, ఉపాధి కల్పించాలని కోరుతూ వినతిపత్రాలు వచ్చాయి. ఇలా పలు రకాల వినతులు రాగా రాష్ట్ర స్థాయి అధికారులు వాటిని పరిశీలించి కలెక్టర్‌కు పంపించారు. ఇలా అందిన ఫిర్యాదులను జిల్లా యంత్రాంగం శాఖల వారీగా కేటాయించి వారంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో శాఖల వారీగా అధికారులు అర్జీల సాధ్యాసాధ్యాలపై కసరత్తు ప్రారంభించారు.

రెవెన్యూ సంబంధిత ఫిర్యాదులే..

రాష్ట్ర స్థాయిలో వచ్చిన ఫిర్యాదుల్లో అధిక శాతం రెవెన్యూ సంబందిత ఫిర్యాదులే ఉన్నాయి. రైతులు సంవత్సరాల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా భూ సమస్యలు పరిష్కారం కావడం లేదు. భూముల ఆక్రమణ, తప్పుడు రిజిస్ట్రేషన్లు, పేర్ల మార్పు, హద్దుల సమస్య, మ్యూటేషన్ కాకపోవడం తదితర సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల, జిల్లా స్థాయిలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో బాధితులు పదేపదే ఫిర్యాదు చేసినా మోక్షం కలగడం లేదు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంలో ఈసారైనా తమ సమస్యలు పరిష్కారం అవుతాయని బాధితులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

శాఖల వారీగా పంపించాం



ప్రభుత్వం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణి దరఖాస్తులు జిల్లాకు వచ్చాయి. వీటిని ఆయా శాఖలకు పంపించాం. వారం రోజుల్లోగా వీటిని పరిష్కరించాలని సూచించాం. పరిష్కారం చేయలేనివి ఉంటే ఆ వివరాలను తెలపాలని కోరాం. వీలనైన్ని సమస్యలు పరిష్కరిస్తాం. పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తాం.

– హనుమంతు కె. జెండగే, కలెక్టర్, యాదాద్రి భువనగిరి

దరఖాస్తుల ఆన్‌లైన్

- ముగిసిన ప్రజాపాలన అర్జీల కంప్యూటరీకరణ ప్రక్రియ
- 2,68,790 దరఖాస్తులను ఆన్‌లైన్ చేయించిన అధికారులు

సాక్షి యాదాద్రి: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల హామీల్లో భాగంగా ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా గత నెల 28వ తేదీ నుంచి జనవరి 6వ రకు ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈమేరకు అభయ హస్తం ద్వారా ఐదు గ్యారంటీల పథకానికి సంబంధించి స్వీకరించిన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ శనివారంతో ముగిసింది. జిల్లాలో అన్ని మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయాలతో పాటు, మున్సిపాలిటీల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన మొత్తం 2,68,790 దరఖాస్తులను ఆన్‌లైన్ చేసినట్లు అధికారులు వెల్లడించారు.

5వ తేదీ నుంచి ప్రారంభమైన ప్రక్రియ..

జనవరి 5వ తేదీ నుంచి అభయ హస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టారు. ఆయా మండలాల పరిధిలోని గ్రామాల్లో చేపట్టిన ప్రజాపాలన గ్రామ సభల్లో స్వీకరించిన అభయ హస్తం దరఖాస్తులన్నింటినీ మండల కార్యాలయాల్లో ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభించారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లోని వార్డు సభల ద్వారా స్వీకరించిన దరఖాస్తులను స్థానిక ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రభుత్వ ఆపరేటర్లతోనే ఆన్‌లైన్ నమోదు చేయించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హనుమంతు కే. జెండగేతోపాటు అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు, ఆర్డీఓలు, ఎంఆర్‌ఓలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షించారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా ప్రజలు సమర్పించిన అయిదు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తులన్నింటినీ ఆన్‌లైన్ చేశారు.



దరఖాస్తులు ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

ఆయా పథకాల కింద..

జిల్లాలోని 17 మండలాలతో పాటు 421 గ్రామ పంచాయతీలు, 6 మున్సిపాలిటీల్లోని వార్డుల్లో స్వీకరించిన 2,68,790 దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తయింది. అదేవిధంగా గృహలక్ష్మికి 2,47,066, మహాలక్ష్మి కింద 2,32,053, అమరవీరులు కుటుంబాల వారు 388, ఉద్యమకారులు 2,616, గ్యాస్ కోసం 2,30,412, రైతుబంధు కోసం 1,22,084, కౌలు రైతులు 7316 మంది, వికలాంగులు 8351, సబ్సిడీ విద్యుత్ కోసం 206530, ఇతర పథకాల కోసం 57,299 మంది దరఖాస్తు చేసుకోగా.. అన్నింటినీ ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

భువనగిరికి వన్ స్టార్

- చెత్తరహిత పట్టణంగా గుర్తింపు
- రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంక్
- ఇటీవలే ఓడీఎఫ్ ప్లస్‌ప్లస్ అవార్డు

భువనగిరి : స్వచ్ఛతలో భువనగిరి మున్సిపాలిటీ మరోమారు సత్తా చాటింది. పరిశుభ్రమైన పట్టణంగా(క్లీన్ సిటీ) మొదటిసారి వన్ స్టార్ హోదా దక్కించుకొని రాష్ట్రస్థాయిలో 5వ స్థానంలో నిలిచింది. బహిరంగ మలమూత్ర విసర్జనలోనూ ఇటీవల ఓడీఎఫ్ ప్లస్ ప్లస్‌ర్యాంక్ కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. కేంద్ర పట్టణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏటా స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మౌలిక సదుపాయాలు, అందిస్తున్న సేవలు, పారిశుద్ధ్యం, సర్వీస్ లెవల్ బెంచ్, చెత్త రహితంగా మార్చడం వంటి అంశాలపై సర్వే చేస్తుంది. ఆయా అంశాల్లో భువనగిరి మున్సిపాలిటీ వన్ స్టార్ హోదా సాధించింది.

స్వచ్ఛత కోసం చేపట్టిన చర్యలు ఇవీ..

మున్సిపాలిటీ పరిధిలోని 35 వార్డుల్లో 75వేల జనాభా ఉంది. ఆయా ప్రాంతాల నుంచి రోజూ సుమారు 20 నుంచి 22 మెట్రిక్ టన్నుల చెత్త, ఇతర వ్యర్థాలు ఉత్పత్తి అవుతుంటాయి. కాగా పారిశుద్ధ్య కార్మికులు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తారు. చెత్తరహిత పట్టణంగా మార్చే లక్ష్యంతో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా పట్టణవాసులకు మున్సిపల్ అధికారులు అవగాహన కల్పించారు. ఇందుకోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పోస్టర్లు, వాల్‌రైటింగ్ ద్వారా ప్రచారం చేశారు. ఉదయం సమయంలోనూ కాకుండా ఎప్పటికప్పుడు చెత్తను తొలగించారు. గత ఏడాది ఆగస్టులో ముగ్గురు సభ్యులతో కూడిన కేంద్ర బృందం పట్టణంలో పర్యటించింది. చెత్త సేకరణ విధానం, చెత్తను తొలగించే ప్రక్రియలను పరిశీలించారు.



ఇంటింటికీ చెత్త సేకరిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

మొదటిసారిగా వన్ స్టార్ హోదా

చెత్తరహిత పట్టణాలకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ 5 స్టార్, 3 స్టార్, వన్ స్టార్ హోదాలను ప్రకటించింది. ఇందులో భాగంగా 50 వేలు – ఒక లక్ష జనాభా కేటగిరీలో సౌత్‌జోన్ పరిధిలో భువనగిరి మున్సిపాలిటీకి వన్ స్టార్ హోదా దక్కింది. సౌత్‌జోన్‌లో 201 మున్సిపాలిటీలు పోటీపడగా భువనగిరికి 176 ర్యాంకు వచ్చింది. రాష్ట్ర స్థాయిలో 31 మున్సిపాలిటీలు పోటీలో నిలవగా 5వ ర్యాంకు సాధించింది. ఇదే విభాగంలో గత సంవత్సరం భువనగిరి సౌత్‌జోన్‌లో 663 స్థానంలో ఈసారి ర్యాంకు మెరుగుపరుచుకొని వన్ స్టార్ హోదా దక్కించుకుంది.

అందరి సహకారంతోనే ర్యాంకులు



స్వచ్ఛ సర్వేక్షణలో భువనగిరి మున్సిపాలిటీకి ఇప్పటికే రెండుసార్లు ఓడీఎఫ్ ప్లస్‌ప్లస్ అవార్డులు లభించాయి. చెత్తరహిత విభాగంలో మొదటిసారిగా వన్ స్టార్ హోదా లభించింది. వచ్చే సంవత్సరం 5 స్టార్ లేదా 3 స్టార్ దక్కించుకోవడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తాం. అందరి సహకారంతోనే ర్యాంకులు సాధించాం.

– నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, భువనగిరి

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం వేద మంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యఅగ్నిహోత్రి, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అదే విధంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి, రాజ్యలక్ష్మి చెంచులక్ష్మి అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. ప్రధాన ఆలయంలోని ముఖమండపంలో నూతన పట్టు వస్త్రాలతో స్వామి,అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్లమహోత్సవ సంవాదం చేపట్టారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం , పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్కపూజ మాంగళ్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు నిర్వహించారు. అదేవిధంగా క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో పూజలు చేపట్టారు. అంతేగాక శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాఢవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు, ఈఓ, అర్చకులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఎమ్మెల్సీ అభ్యర్థిగా అద్దంకి దయాకర్

- ఖరారు చేసిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం
- ఇంకా వెలువడని అధికారిక ప్రకటన
- 18వ తేదీ వరకు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ

తిరుమలగిరి : ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ అద్దంకి దయాకర్‌ను మంగళవారం ఖరారు చేసింది. అయితే, ఆ పార్టీ అధిష్టానం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఈనెల 29వ తేదీన ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. వీటికి సంబంధించి ఈనెల 18న నామినేషన్లకు చివరి తేదీ. దీంతో నామినేషన్ వేయడానికి సిద్ధం కావాలని పార్టీ అధిష్టానం ఆయనకు సూచించినట్లు తెలిసింది. అద్దంకి దయాకర్ స్వగ్రామం సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలంలోని నెమ్మికల్. ఈయన తెలంగాణ ఉద్యమంలో జేఏసీ నాయకుడిగా పనిచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్పతేడాతో ఓడిపోయారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి టికెట్ కోసం ప్రయత్నం చేశారు. కానీ చివరి నిమిషంలో దయాకర్‌ను కాదని పార్టీ అధిష్టానం మందుల సామేల్‌కు టికెట్ ప్రకటించింది. పార్టీ అధికారంలోకి వస్తే తగిన న్యాయం చేస్తామని అధిష్టానం అప్పట్లో హామీ ఇచ్చింది. అధిష్టానం ఆదేశాను సారం ఎమ్మెల్యే టికెట్‌ను వదులు కోవడంతో పాటు మందుల సామేల్ గెలుపునకు విశేషంగా కృషిచేశారు. గతంలో ఇచ్చిన హామీలో భాగంగా ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా దయాకర్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. దయాకర్ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందన్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్తి మెజార్టీ ఉండటంతో దయాకర్ గెలుపు ఇక లాంఛనమే కానుంది.



అద్దంకి దయాకర్

చివరి ఆయకట్టుకూ సాగు నీరందిస్తా

- రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నడిగూడెం : హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేయించి ఆయకట్టు పరిధిలోని చివరి భూములకూ సాగు నీరందిస్తామని రాష్ట్ర భారీ నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో గల తన కార్యాలయంలో నడిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. సంక్షేమ పథకాలు అందరికీ అందేలా నాయకులు, కార్యకర్తలు చూడాలన్నారు. నడిగూడెం మండల అభివృద్ధికి పాటుపడుతానన్నారు. నడిగూడెం మండలంలో ఆర్ అండ్ బీ రోడ్లు, సీసీ రహదారులు, డ్రెయినేజీలు, వంతెనలు, వివిధ గ్రామాలకు లింకురోడ్లు నిర్మించాలని పలువురు నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మంత్రి తక్షణమే ప్రతిపాదనలు పంపించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నాయకులను కోరారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీనివాస్, వైస్‌ఎంపీపీ బడేటి వెంకటేశ్వర్లు, నడిగూడెం ఎంపీటీసీ సభ్యుడు గుండు శ్రీను, నాయకులు ఏపూరి సుధీర్, రామిని విజయ్‌వర్ధన్‌రెడ్డి, గులాం, బాణాల నాగరాజు, దున్నా శ్రీను, మండవ అంతయ్య, భిక్షం, ఎల్.శ్రీను, మోసిన్, తదితరులు పాల్గొన్నారు.



నడిగూడెం మండల నాయకుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తమ్ కుమార్‌రెడ్డి

అందని రెమ్యునరేషన్

- టెన్త్ పరీక్ష పేపర్ల మూల్యాంకనంలో పాల్గొన్న 712 మంది ఉపాధ్యాయులు
- తొమ్మిది నెలలు గడుస్తున్నా అందని డబ్బులు
- రావాల్సిన నిధులు రూ.26లక్షలు

భువనగిరి: పదో తరగతి పరీక్ష పేపర్లు మూల్యాంకనం చేసి దాదాపు తొమ్మిది నెలలు గడుస్తున్నా పేపర్లు దిద్దిన ఉపాధ్యాయులకు మాత్రం ఇప్పటివరకు రెమ్యునరేషన్ అందలేదు. గతంలో టెన్త్ పరీక్ష పేపర్లను దిద్దేందుకు నల్లగొండకు వెళ్లేవారు. కానీ గతేడాది నుంచి జిల్లా కేంద్రంలోనే పరీక్ష పేపర్లు మూల్యాంకనం చేస్తున్నారు. గతేడాది ఏప్రిల్13 నుంచి 21వ తేదీ వరకు భువనగిరి పట్టణ సమీపంలోని దివ్యబాల విద్యాలయంలో ఈ ప్రక్రియ నిర్వహించారు.

1.19 లక్షల పేపర్ల మూల్యాంకనం..

టెన్త్ పరీక్ష పేపర్లు దిద్దేందుకు భువనగిరి పట్టణ శివారులోని దివ్యబాల విద్యాలయంలో కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రానికి 1,19,452 పరీక్ష పేపర్లు కేటాయించారు. ఆయా పేపర్లను దిద్దేందుకు 712 మంది ఉపాధ్యాయులను నియమించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పేపర్లను దిద్దారు. మూల్యాంకనం ప్రక్రియలో చీఫ్ ఎగ్జామినర్లు, ప్రత్యేక సహాయకులు, కేంద్ర నిర్వాహకులు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు విధులు నిర్వహించారు. ఒక్కో పేపర్‌ను దిద్దినందుకు రూ.10ల చొప్పున కేటాయించాలని ఆదేశించారు. కేంద్రానికి వచ్చి వెళ్లడానికి ప్రయాణ భత్యం, రోజూ కరువు భత్యం ఇస్తామని అధికారులు పేర్కొన్నారు. మూల్యాంకనానికి 712 మంది ఉద్యోగులు పాల్గొనగా.. మొత్తం రూ.26లక్షల వరకు నిధులు చెల్లించాల్సి ఉంది. మూల్యాంకనం చివరి రోజు ఉపాధ్యాయుల ఖాతాలో రెమ్యునరేషన్ జమ చేస్తామని గతంలోనే ప్రభుత్వం స్పష్టం చేసింది. కానీ ఇప్పటివరకు ఆ డబ్బులను జమ చేయలేదు. ఇప్పటికే 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి, మార్చి 18 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించనున్నట్లు షెడ్యూల్ విడుదల చేశారు. కానీ గత పరీక్ష పేపర్లు దిద్దిన ఉపాధ్యాయులకు డబ్బులు మాత్రం అందలేదు.



వెంటనే చెల్లించాలి



పదో తరగతి పరీక్ష పేపర్ల మూల్యాంకనం జరిగి సుమారు 9 నెలలు గడుస్తున్నా రెమ్యునరేషన్ ఇప్పటివరకు చెల్లించకపోవడం సరికాదు. కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం చొరవ చూపి నిధులు వెంటనే విడుదల చేయాలి. మళ్లీ పదో తరగతి పరీక్ష షెడ్యూల్ కూడా వచ్చింది. వెంటనే ప్రభుత్వం, అధికారులు డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

– మైలారం సత్తయ్య, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

నివేదిక పంపించాం



పదో తరగతి పరీక్ష పేపర్లకు సంబంధించి మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయు ల రెమ్యునేషన్ నివేదికను విద్యాశాఖ ఉన్నతాధికారులకు పంపించాం. జిల్లాకు సుమారు రూ.26లక్షల వరకు నిధులు రావాల్సి ఉంది. ఇప్పటికే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే వారి ఖాతా లో జమ అవుతాయి.

– నారాయణరెడ్డి, డీఈఓ

క్లుప్తంగా

మురుగు కాల్వలో పడి వృద్ధురాలు మృతి

మునుగోడు: కాలకృత్యాలకు వెళ్లిన వృద్ధురాలు మురుగు కాల్వలో పడి మృతిచెందింది. ఈ ఘటన మునుగోడులో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. మునుగోడు పట్టణానికి చెందిన సరికొండ రుక్కమ్మ (70) ఈ నెల 11వ తేదీ రాత్రి కాలకృత్యాల కోసం పట్టణ శివారులోని మురుగు కాల్వ వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు ఆ కాల్వలో పడి మృతిచెందింది. కానీ ఈ విషయం ఆమె కుటుంబ సభ్యులకు తెలియక ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. కాగా మంగళవారం మధ్యాహ్న సమయంలో పట్టణ శివారులోని మురుగు కాల్వలో మహిళ మృతదేహాన్ని గుర్తించిన ఓ వ్యక్తి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం రుక్కమ్మదిగా గుర్తించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళా హెడ్‌కానిస్టేబుల్ మృతి

రామగిరి(నల్లగొండ): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళా హెడ్‌కానిస్టేబుల్ మంగళవారం మృతి చెందింది. వివరాలు.. తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కుర్రా భారతి(48) నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని కేశరాజుపల్లి వద్ద గల హ్యాపీ హోమ్స్‌లో నివాసముంటోంది. ఆమె భర్త గతంలోనే మృతిచెందాడు. గతేడాది నవంబర్ 1వ తేదీన ఆమె విధులు ముగించుకొని స్కూటీపై నల్ల గొండకు వస్తుండగా తిప్పర్తి మండలం మల్లేపల్లివారిగూడెం సమీపంలో అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ ప్రమాదంలో భారతి తలకు తీవ్ర గాయాలు కావడంతో కోమాలోకి వెళ్లింది. అప్పటి నుంచి హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె మంగళవారం ఉదయం 11 గంటలకు మృతి చెందింది. నల్లగొండ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. భారతి కుమార్తె మెడిసిన్, కుమారుడు బీటెక్ చదువుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

పాలకవీడు: మండలంలోని బొత్తలపాలెం గ్రామంలో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మంగళవారం గ్రామస్తులు, ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం.. బొత్తలపాలెం గ్రామంలోని ఎస్సీ కాలనీ వద్ద మురుగు కాలువలో మంగళవారం ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కాలువలో నుంచి బయటకు తీశారు. మృతుడు గ్రామానికి చెందిన ఎడ్ల పాండు(56)గా గుర్తించారు. మృతుడి తలకు గాయం కావడంతో గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సీఐ రామలింగారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీం సహాయంతో వివరాలు సేకరించారు. పాండు భార్య కొంతకాలం క్రితమే మృతిచెందిందని, వారికి ఒక కుమారుడు, కుమార్తె సంతానం. ఇద్దరికీ వివాహాలు చేశాడని, పాండు ఒంటరిగానే గ్రామంలో నివసిస్తున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. మృతుడి కుమార్తె స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు.

వ్యక్తి అదృశ్యం


లింగు

భువనగిరి క్రైం: భువనగిరి మండలంలోని పచ్చర్ల బోడుతండా గ్రామానికి చెందిన కునుసోతు లింగు ఈ నెల 11వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో మంగళవారం అతడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 11వ తేదీ నుంచి లింగు ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ వస్తుండడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో లింగు తల్లి జూమ్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ వి. సంతోష్‌కుమార్ తెలిపారు. లింగు చామన ఛాయ రంగు, 5.8 అడుగుల ఎత్తు ఉంటాడని, నీలి రంగు నిక్కరు, తెలుపు రంగు గీతల చొక్కా ధరించి ఉన్నాడని ఎస్ఐ పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 8712662472, 8712662733 నంబర్ల సమాచారం ఇవ్వాలన్నారు.

డబ్బుల కోసమే హత్య చేశారా..?

- అనుమానాస్పద స్థితిలో పాత ఇనుప సామాను దుకాణ యజమాని మృతి
- మృతుడి శరీరంతో పాటు అతడు నిద్రించిన మంచంపై రక్తం మరకలు
- ఇద్దరిని గుర్తించిన డాగ్ స్క్వాడ్.. అరెస్ట్ చేసిన పోలీసులు
- మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో ఘటన


కలీమొద్దీన్ (ఫైల్)

మోత్కూరు: అనుమానాస్పద స్థితిలో పాత ఇనుప సామాను దుకాణ యజమాని మృతి చెందాడు. ఈ ఘటన మోత్కూరు పట్టణంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణానికి చెందిన ఎండీ కలీమొద్దీన్(70) సుమారు 30 సంవత్సరాలుగా మో త్కూరు మున్సిపల్ కేంద్రంలోని అంగడిబజార్ ప్రాథమిక పాఠశాల సమీపంలో పాత ఇనుప సామాను దుకాణం నిర్వహిస్తూ అక్కడే ఉంటున్నాడు. అతడికి భార్యాపిల్లలు లేరు. ఇటీవల కలీమొద్దీన్ భువనగిరికి వెళ్లి తన సమీప బంధువుల వద్ద దాచుకున్న రూ.1.90 లక్షల నగదును తీసుకొని వచ్చి తన దుకాణంలో దాచుకున్నాడు. దుకాణంలో నలుగురైదుగురు కూలీలు రోజువారీగా పని చేస్తుంటారు. వారు గ్రామాలలో కొనుగోలు చేసిన పాత ఇనుప సామాను, ఇతర వస్తువులను ఈ దుకాణంలో విక్రయిస్తారు. మంగళవారం ఉదయం పాలు పోసేందుకు వెళ్లిన వ్యక్తి కలీమొద్దీన్‌ను పిలువగా అతడు పలకలేదు. దీంతో దుకాణం లోపలికి వెళ్లి చూడగా మంచంపై కలీమొద్దీన్ విగతజీవిగా పడి ఉండటం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ఏఎస్ఐ ప్రభాకర్‌నాయుడు ఘటనా స్థలానికి చేరుకుని డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. ఇద్దరు వ్యక్తులను డాగ్ స్క్వాడ్ గుర్తించగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఖలీమొద్దీన్ శరీరంపై, మంచం, గోడ, అద్దంపై రక్తం మరకలను పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలాన్ని చౌటుప్పల్ ఏసీపీ మొగులయ్య, రామన్నపేట సీఐ మోతీరామ్ పరిశీలించారు. కలీమొద్దీన్ మంచంపై నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు డబ్బుల కోసం ఆరా తీయగా.. అతడు ఇవ్వకపోవడంతో హత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుని మెడపై ఎడమ వైపు పదునైన ఆయుధంతో బలంగా కొట్టారని, దీంతో రక్తస్రావమై ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. పూర్తిస్థాయి విచారణ చేసి నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఏసీపీ విలేకరులకు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కొరకు రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు పూరి గుడిసె దగ్ధం

- రూ.5 లక్షలు, 7తులాల బంగారం అగ్నికి ఆహుతి


కాలిబూడిదైన పెట్టె, డబ్బులు

మిర్యాలగూడ అర్బన్: ప్రమాదవశాత్తు పూరి గుడిసె దగ్ధమైన ఘటన మిర్యాలగూడ మండలం కొత్తసామ్యతండాలో సోమవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తసామ్యతండాకు ధనావత్ హనుమ కుటుంబం వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవార మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి వారు నివసిస్తున్న పూరి గుడిసెకు అంటుకున్నాయి. ఇది గమనించిన కుటుంబ సభ్యులు భయంతో బయటకు పరుగులు తీశారు. తండావాసులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. క్షణాల్లో మంటలు ఇంటిని మొత్తం వ్యాపించడంతో ఇంట్లోని వస్తువులన్నీ పూర్తిగా దగ్ధమయ్యాయి. ఘటనా స్థలానికి అగ్నిమాపక అధికారులు వచ్చి మంటలను ఆర్పివేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగి పూరి గుడిసెకు అంటుకున్నాయని అగ్నిమాపక అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనలో ఇంటి నిర్మాణం కోసం తెచ్చిన రూ.5లక్షలతో పాటు 7 తులాల బంగారు ఆభరణాలు పూర్తిగా మంటల్లో కాలిపోయాయని బాధితులు వాపోయారు. విషయం తెలుసుకున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

పాన్ షాపు దగ్ధం

డిండి: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల ఓ పాన్ షాపునకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో దగ్ధమైంది. ఈ ఘటన సోమవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. డిండి పట్టణానికి చెందిన పద్మమ్మ తన భర్త మృతి చెందడంతో గత 20 సంవత్సరాల నుంచి స్థానిక బస్టాండ్ సమీపంలో పాన్ షాపు నడుపుతూ సమీపంలోనే నివాసం ఉంటుంది. ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పాన్ షాపునకు నిప్పంటించడంతో మంటలు చెలరేగాయి. దీంతో చుట్టుపక్కల వారు గమనించి పద్మమ్మకు సమాచారం ఇవ్వడంతో ఆమె తన కుటుంబ సభ్యులతో కలిసి అక్కడకు చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా.. అప్పటికే షాపు పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.20వేల వరకు నష్టం జరిగిందని బాధితురాలు పేర్కొంది. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సైదులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో చోరీ

తుంగతుర్తి: మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతుర్తి మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం యజ మాని నిమ్మల వేణు రోజుమాదిరిగానే సోమవారం సాయంత్రం దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం షాపు తెరిచేందుకు రాగా షెట్టర్ తాళం పగులగొట్టి ఉండటంతో పాటు రెండు సీసీ కెమెరాలు ధ్వంసం చేసి ఉండటం గమనించి షాపు తెరిచి కౌంటర్‌లో ఉన్న నగదును ఉందా లేదాని చూశాడు. కౌంటర్‌లో ఉన్న రూ.2.05లక్షల నగదు కనిపించకపోవడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు షాపు వద్దకు వచ్చి క్లూస్ టీంను పిలిపించి ఆధారాలను సేకరించారు. అదేవిధంగా ఆగ్రోస్ కేంద్రం సమీపంలో ఉన్న ఇస్లావత్ విజయ్ చికెన్ షాపు ముందు ఉన్న బైక్‌ను కూడా దుండగులు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.


ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

రెండు బైక్‌లు ఢీ.. ఒకరు దుర్మరణం


మహేష్ (ఫైల్)

ఆలేరురూరల్: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన ఆలేరు మండలంలోని గొలనుకొండ సమీపంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు గ్రామానికి చెందిన సీసా మహేష్(35) సోమవారం సంక్రాంతి పండుగకు బైక్‌పై ఆలేరు మండలంలోని గొలనుకొండలో గల తన అత్తగారింటికి వచ్చాడు. అదే రోజు మధ్యాహ్నం పెద్దకందుకూరుకు తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో గొలనుకొండ సమీపంలోని కుమ్మరికుంట వద్దకు చేరుకోగానే జనగామ జిల్లా లింగాల ఘనపూర్ మండలం కుందారం గ్రామానికి చెందిన ఎల్లల నరేష్ పల్సర్ బైక్‌పై అమ్మనబోలు నుంచి వస్తూ మహేష్ బైక్‌ను ఎదురుగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మహేష్ రోడ్డుపై పడిపోగా తల పగిలి అక్కడిక్కడే మృతిచెందా డు. నరేష్‌కు తీవ్ర గాయాలు కాగా హై దరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు మహేష్‌కు భార్య, ముగ్గురు పిల్లలు పల్లిలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి. వెంకటశ్రీను తెలిపారు.

అదుపుతప్పి కారు బోల్తా.. ఇద్దరు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


నుజ్జునుజ్జయిన కారు

చింతపల్లి: హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై చింతపల్లి మండల పరిధిలోని పోలేపల్లి రాంనగర్ వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఏఎస్ఐ చంద్రారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండల పరిధిలోని కుర్రంపల్లి గ్రామానికి చెందిన పోలోజు రాఘవేందర్(29), దార్ల ప్రభాకర్, దార్ల అరవింద్ (22) సోమవారం రాత్రి 11 గంటల సమయంలో తమ స్వగ్రామమైన కుర్రంపల్లి నుంచి కారులో చింతపల్లి మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వరనగర్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. మార్గమధ్యలో పోలేపల్లి వద్ద కారు అదుపుతప్పి బోల్తా కొట్టడంతో కారులో ఉన్న దార్ల అరవింద్, పోలోజు రాఘవేందర్ ఇరువురికి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. దార్ల ప్రభాకర్‌కు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడు..

వేములపల్లి: బైక్‌పై వెళ్తున్న యువకుడు అదుపు తప్పి రైస్ మిల్లు గోడను ఢీకొని మృతిచెందాడు. ఈ ఘటన వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామ శివారులో నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై సోమవారం రాత్రి జరిగింది. ఏఎస్ఐ నరసింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు మండలం కల్వలపల్లి గ్రామానికి చెందిన వంటిపాక స్వామి(25) ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. రోజువారీ పనిలో భాగంగా సోమవారం ఉదయం తన బైక్‌పై మిర్యాలగూడకు వచ్చి పని ముగించుకుని సాయంత్రం మునుగోడుకు వెళ్తున్నాడు. మార్గమధ్యలో వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామ శివారులోని మహేశ్వరి మిల్లు వద్దకు రాగానే బైక్ అదుపుతప్పడంతో మిల్లు గోడకు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో స్వామికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి శ్రీరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఏఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

రామన్నపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఆస్పత్రి ఆవరణలోని సిమెంట్ బెంచీపై నిద్రించిన ఉన్న వ్యక్తిని సిబ్బంది గమనించి లేపడానికి ప్రయత్నించినప్పటికీ స్పందించకపోవడంతో అతడు చనిపోయినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు వయస్సు 55 సంవత్సరాలు ఉంటుందని, తెల్ల రంగు చొక్కా, నీలం రంగు లుంగీ ధరించాడని, గడ్డంతో పాటు కాలుకు కట్టుకట్టి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చినట్లు పేర్కొన్నారు. కాగా మృతుడు హాలియా పట్టణంలోని సాగర్ రోడ్డు వాసిగా పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. కానీ సోమవారం రాత్రి వరకు అతడి సంబంధీకులు ఎవరూ రాలేదని పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో గొడవ.. బైక్‌కు నిప్పు


దగ్ధమైన బైక్

పాలకవీడు: మండలంలోని సజ్జాపురం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు సోమవారం రాత్రి గ్రామ శివారులో మద్యం సేవించి గొడవపడ్డారని.. ఈ క్రమంలో ఓ బైక్‌ను తగలబెట్టినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ లింగంను వివరణ కోరగా.. సజ్జాపురం గ్రామానికి చెందిన మూగల బాలసైదులు మరో వ్యక్తితో కలిసి సోమవారం రాత్రి బైక్‌పై వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు వారిని అడ్డుకుని వారి బైక్‌ను తగలబెట్టినట్లు తెలిపారు. మూగల బాలసైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం మద్యం మత్తులో జరిగిన గొడవకారణంగానే బైక్‌కు నిప్పు పెట్టారా.. లేదా వ్యక్తిగత కక్షతో ఈ ఘటన చోటుచేసుకుందా అనే విషయం తెలియనుంది.

విలేకరులమంటూ బెదిరించిన వారిపై కేసు

నడిగూడెం: విలేకరులమలంటూ వచ్చి రైతును బెదిరించిన వారిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి. ఏడుకొండలు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. నడిగూడెం మండలంలోని రత్నవరం గ్రామానికి చెందిన మిర్యాల ఆంజనేయులు కొద్దినెలలుగా తన వ్యవసాయ క్షేత్రంలో చేపల పెంపకం చేస్తున్నాడు. కోదాడకు చెందిన రామకృష్ణ, రవి అనే విలేకరులు ఆంజనేయులును తమ పత్రికలకు యాడ్స్ ఇవ్వాలని, లేకపోతే అధికారులకు చెప్పి కేసులు పెట్టిస్తామని బెదిరించారు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన మిర్యాల గురుస్వామిని కూడా వారు డబ్బులు ఇవ్వాలని బెదించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తండ్రిపై గొడ్డలితో దాడి చేసిన కుమారుడు

రామగిరి (నల్లగొండ): తండ్రిపై గొడ్డలితో కుమారుడు దాడి చేశాడు. తిప్పర్తి ఎస్ఐ ఎస్. ధర్మ తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలంలోని అనిసెట్టిదుప్పలపల్లి గ్రామానికి చెందిన విశ్వనాథుల నాగాచారిపై సోమవారం అతడి కుమారుడు కోటేష్ గొడ్డలితో దాడి చేశాడు. ఈ దాడిలో నాగాచారి తలకు తీవ్రగాయాలయ్యాయి. నాగాచారిని చికిత్స నిమిత్తం నల్ల గొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శబరిమలైలో ఆత్మకూర్ మండల వాసి మృతి


వెంకన్న(ఫైల్)

ఆత్మకూర్ (ఎస్): మండలంలోని దాచారం గ్రామానికి చెందిన అల్లి వెంకన్న (58) అనారోగ్యంతో శబరిమలలో మృతిచెందాడు. వెంకన్న మూడు రోజుల క్రితం శబరిమలకు వెళ్లాడు. ఎక్కువ సేపు క్యూలో నిల్చోవడంతో అతడు అనారోగ్యానికి గురి కాగా హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు.

సరైన జాగ్రత్తలతో 'వంగ'లో అధిక దిగుబడులు


పాడి పంట

నడిగూడెం: వంకాయ(వంగ) సాగులో ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు పొందవచ్చని హార్టికల్చర్ కన్సల్టెంట్ సుందరి సురేష్ అన్నారు. ప్రస్తుతం మంచుతో కూడిన చల్లని వాతావరణం ఉంటుండడంతో పంట తొలి దశ నుంచి సరైన జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

ఆశించే పురుగులు, తెగుళ్లు

1. మొవ్వు మరియు కాయతొలుచు పురుగు: ఈ పురుగు నాటిన 30–40 రోజుల నుంచి ఆశిస్తుంది. మొక్క పెరుగుదల దశలో మొవ్వును, తర్వాత దశలో కాయలను తొలిచి నష్టాన్ని కలుగచేస్తుంది. కాయలు వంకర్లు తిరిగిపోతాయి. కొమ్మల చివరల పెరుగుదల ఆగిపోతుంది. దీని నివారణకుగాను పురుగు ఆశించిన కొమ్మలను తుంచివేయాలి. తొలిదశలో వేప నూనె లీటరు నీటికి 5 మి.లీ. లేదా కార్బరిల్ 50 శాతం 3 గ్రాములు, లీటరు నీటికి, లేదా ప్రొఫెనోఫాస్ 2.మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

2. రసం పీల్చే పురుగులు: ఈ పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చివేయడం వలన ఆకులు పసుపు రంగుకు మారి పైకి ముడుచుకొని ఎండిపోతాయి. వీటి నివారణకు డైమీథోయేట్ లేదా మిథైల్‌డెమటాన్ లేదా ఫిప్రోనిల్ లీటరు నీటికి 2 మి.లీ. చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

3. ఎర్రనల్లి: ఈ పురుగు ఆకుల అడుగు భాగాన చేరి, రసం పీల్చడం వలన ఆకులు పాలిపోయి తెల్లగా మారుతాయి. ఆకులపై సాలె గూడు వంటి తీగలు ఏర్పడతాయి. దీని నివారణకు లీటరు నీటికి నీటిలో కరిగే గంధకం 3గ్రా. లేదా డైకోఫాల్ 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

4. ఆకుమాడు తెగులు: నారును పొలంలో నాటిన తర్వాత 30 రోజులకు ఈ తెగులు ఆశిస్తుంది. ఆకులన్నీ మాడిపోయినట్లుగా కనిపిస్తాయి. ఈ తెగులు ఆశించినప్పుడు ఆకులపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. తర్వాత పసుపురంగుకు మారి వాడి రాలిపోతాయి. తేమతో కూడిన చల్లని వాతావరణంలో ఈ తెగులు ఎక్కువగా కన్పిస్తుంది. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా మాంకోజెబ్ 2.5 గ్రాములు, లేదా కార్బెండిజమ్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారీ చేయాలి.

5. ఆకుమాడు మరియు కాయకుళ్లు తెగులు: ఆకులమీద అక్కడక్కడ గోధుమ రంగుతో కూడిన మచ్చలు కన్పిస్తాయి. తెగులు ఉధృతమైతే ఆకులు మాడి రాలిపోతాయి. తెగులు సోకి న కాయలు పసుపురంగుకు మారి కుళ్లిపోతాయి. దీని నివారణకు నారుమడిలో విత్తేముందు 50 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత గల వేటిలో విత్తనాలను 30 నిమిషాలపాటు నానబెట్టి విత్తుకోవాలి. తెగులు సోకిన పొలంలో పంటమార్పిడి తప్పనిసరిగా పాటించాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాముల మందును లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో 2–3 సార్లు పిచికారీ చేయాలి.

6. వెర్రి తెగులు: ఆకులు సన్నగా మారి పాలిపోయిన ఆకుపచ్చని రంగు కల్గి ఉంటాయి. మొక్కలు గుబురుగా చీపురుకట్టలా కనబడతాయి. పూత, కాత లేకుండా మొక్కలు గొడ్డు బారిపోతాయి. ఇది వైరస్ తెగులు. దీని నివారణకు ఆశించిన మొక్కలను తొలగించి నాశనం చేయాలి. నారుదశలో నాటడానికి ముందు 250 గ్రాములు కార్బోఫ్యూరాన్ గుళికలను 100 చ.మీ. నారుమడికి వేయాలి. ప్రధానంగా పురుగు ఆశించిన కాయలను, కొమ్మలను తుంచి నాశనం చేయాలి.

ఇతర జాగ్రత్తలు

వంగ పంటలో అంతర పంటలుగా బంతి, ఉల్లి, వెల్లుల్లి పంటలను వేసుకోవాలి. లింగాకర్షక బుట్టలను ఎకరానికి 4 చొప్పున పెట్టాలి. తలనత్త ఆశించిన కొమ్మలను పురుగు ఆశించిన ప్రాంతం నుంచి ఒక అంగుళం కిందికి తుంచి నాశనం చేయాలి. అల్లిక రెక్కల పురుగులను మొక్కకు 2 చొప్పున పంట పెరిగే దశలో విడుదల చేయాలి. ఎకరానికి 200 కిలోల చొప్పున వేప పిండిని దుక్కిలో వేయాలి.

తెలంగాణలో ప్రజాపాలన మొదలైంది

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి


కోదాడ : ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డికి స్వాగతం పలుకుతున్న అభిమానులు

కోదాడ: రాష్ట్రంలో గడిచిన 10 సంవత్సరాలు నియంత పాలన సాగిందని, ప్రజలు వారిని ఇంటికి పంపడంతో ఇప్పుడు ప్రజాపాలన మొదలైందని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా సోమవారం కోదాడలోని ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు కోదాడకు వచ్చిన ఆమెకు అభిమానులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కోదాడలోని యలమర్తి వేణు మాధవరెడ్డి ఇంట్లో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎర్రబెల్లి దయాకర్‌రావును ఓడించి చిన్న వయస్సులోనే ఎమ్మెల్యేగా గెలవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఝాన్సీరెడ్డి, యలమర్తి వేణుమాధవరెడ్డి, వైడిరెడ్డి, కోదండరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవరంలో పాలకుర్తి ఎమ్మెల్యే పూజలు

కోదాడరూరల్: కోదాడ మండల పరిధిలోని తొగర్రాయి శివారులో గల మహాలక్ష్మి, ఎర్రవరంలోని శ్రీబాల ఉగ్రలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆమె అత్త ఎన్ఆర్ఐ ఝాన్సీరెడ్డితో కలిసి సోమవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అమరనాయని వెంకటేశ్వరరావు, పగిడిమర్రి మదన్‌మోహన్‌రావు, భాషబోయిన భాస్కర్‌రావు, బాలెబోయిన వెంకయ్య, యాదా ఉపేందర్, లిక్కి వెంకటయ్య, లతీఫ్ ఉన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

- ముగ్గురికి తీవ్రగాయాలు

కనగల్: నల్లగొండ మండలం జి. చెన్నారం స్టేజీ వద్ద మంగళవారం సాయంత్రం ఆర్టీసీ బస్సు, కారు ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంగళవారం సాయంత్రం నల్లగొండ నుంచి దేవరకొండ వైపు వెళ్తుంది. అదే సమయంలో నల్లగొండ మండలం జి. చెన్నారం గ్రామానికి చెందిన వ్యక్తులు కారులో కనగల్ మండలంలోని దర్వేశిపురం ఎల్లమ్మ ఆలయం వద్దకు వచ్చి తిరిగి వెళ్తుండగా.. జి. చెన్నారం స్టేజీ వద్ద ఆర్టీసీ బస్సు, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో నవీన్, పండు సాయి, కోటేష్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం నల్ల గొండకు తరలించారు. బస్సు ముందు భాగం కొంచెం, కారు పూర్తిస్థాయిలో ధ్వంసమైందని స్థానికులు పేర్కొన్నారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నారు. బాధితులను స్థానిక సర్పంచ్ ఉప్పునూతల వెంకన్నయాదవ్, మాజీ సర్పంచ్ మెట్టు యాదయ్య, బీఆర్ఎస్ మండల యువజన అధ్యక్షుడు ఐతగోని విజయ్ పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మునగాల(కోదాడ): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె మండలంలోని నామవరం గ్రామ పంచాయతీకి చెందిన నిమ్మల కరుణాకర్ బైక్‌పై కోదాడ నుంచి సూర్యాపేట వైపు వెళ్తూ మార్గమధ్యలో మునగాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఉన్న క్రాసింగ్ వద్ద స్టాపర్ బోర్డును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కరుణాకర్‌కు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అనారోగ్యంతో టెక్నికల్ అసిస్టెంట్ మృతి


నర్సింహ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం


నకిరేకంటి నర్సింహ (ఫైల్)

రామన్నపేట: మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన నకిరేకంటి నర్సింహ సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందాడు. ప్రస్తుతం ఆయన వలిగొండల మండలంలో ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నాలుగురోజుల క్రితం ఆస్పత్రిలో చేరాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, బీఎస్పీ నాయకురాలు మేడి ప్రియదర్శిని, ఎంపీపీ నూతి రమేష్, ఏపీడీ శ్యామల తదితరులు నర్సింహ మృతదేహానికి నివాళులర్పించారు.

కూరగాయలు, మాంసం దుకాణాల్లో తనిఖీలు

నల్లగొండ: నల్లగొండలో మంగళవారం ఆయా కూరగాయలె, మాంసం దుకాణాల్లో జిల్లా లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు తనిఖీలు చేశారు. వ్యాపారులు వినియోగిస్తున్న తూకం యంత్రాలు, తూకపు రాళ్లను పరిశీలించారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు రావడంతో హైదరాబాద్ రోడ్డు, దేవరకొండ రోడ్డుల్లోని చికెన్, మటన్ , చేపల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేసామని జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి పి.రామకృష్ణ తెలిపారు. తనిఖీల్లో కిలోకు 50 గ్రాముల తక్కువ తూకం ఉన్నట్లు తేలిందన్నారు. మా చికెన్ సెంటర్, లక్ష్మీచికెన్ సెంటర్, చేపల వ్యాపారి సైదులుపై కేసులు నమోదు చేసి జరిమానా విధించినట్లు తెలిపారు. తనిఖీలో లీగల్ మెట్రాలజీ జిల్లా పరిశీలకులు వి.శ్రీనివాస్, శాఖ అధికారులు జలీల్‌ఖాన్, డి.సైదులునాయక్, డి.సైదులు పాల్గొన్నారు.